సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం, 30, అక్టోబర్, 2023



పోటెత్తిన భక్తులు

విశాఖ రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు.



ఇస్కాన్‌లో దామోదర ఉత్సవాలు

విశాఖ నగరంలోని సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం కార్తీక దామోదర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.



చెరువులవేనంలో సందడి

చింతపల్లి రూరల్: చెరువులవేనంలో పర్యాటకులు సందడి చేశారు. వ్యూపాయింట్ నుంచి మంచు అందాలను తిలకించారు.

న్యూస్‌రీల్

హోంమంత్రి పాపికొండల సందర్శన



గండిపోశమ్మ ఆలయ ఈవోతో మాట్లాడుతున్న హోంమంత్రి వనిత

దేవీపట్నం: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఆదివారం పాపికొండలను సందర్శించారు. ఉదయం రోడ్డు మార్గంలో పురుషోత్తపట్నం మీదుగా పోశమ్మగండికి స్నేహితులతో చేరుకున్నారు. అక్కడి నుంచి పర్యాటక బోట్‌లో పాపికొండల విహారయాత్రకు వెళ్లారు. పేరంటపల్లిలోని శివాలయాన్ని సందర్శించారు. గోదావరి, పాపికొండల అందాలను వీక్షించారు. అనంతరం పోశమ్మగండి చేరుకుని వాహనాల్లో తిరిగి వెళ్లారు.

280 మంది ఉపాధ్యాయుల సర్దుబాటు

విశాఖ విద్య : ఉమ్మడి విశాఖ జిల్లాలో 280 మంది ఉపాధ్యాయులకు వేర్వేరు పాఠశాలల్లో సర్దుబాటు చేస్తూ డీఈవో ఎల్.చంద్రకళ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో గల పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులుగా గుర్తించిన వారిని, అవసరమైన చోట్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద విధులు కేటాయించారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్ బయాలజీ-18, ఇంగ్లిష్-20, హిందీ-7, గణితం-44, ఫిజికల్ సైన్స్-33, సోషల్ సైన్స్-21, తెలుగు-27 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అదేవిధంగా 110 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను సైతం అర్హత మేరకు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. ఉత్తర్వుల్లో పేర్కొన్న ఉపాధ్యాయులంతా కేటాయించిన పాఠశాలల్లో వెంటనే రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

సార్వత్రిక విద్యపై ప్రత్యేక శ్రద్ధ

- ఓపెన్‌స్కూల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గోపాలకృష్ణ



వివరాలు తెలుసుకుంటున్న గోపాలకృష్ణ

అరకులోయ రూరల్: సార్వత్రిక విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ గోపాలకృష్ణ సూచించారు. ఆదివారం ఆయన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఓపెన్ స్కూల్ బోధన తరగతుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో అప్పారావు, డీసీ నాగేంద్ర, పాఠశాల హెచ్ఎం మోహన్‌రావు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో బంగారు పతకం

- ప్రతిభ కనబరిచిన వెటరన్ అథ్లెట్ ప్రసాద్



బంగారు పతకం అందుకుంటున్న ప్రసాద్

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ జర్రిపడ గ్రామానికి చెందిన గిరిజనుడు కుర్తాడి ప్రసాద్ అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఆదివారం విశాఖ పోలీసు బ్యారెక్స్ స్టేడియంలో నిర్వహించిన మాస్టర్స్ వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ చాంపియన్ షిప్-2023 పోటీల్లో సత్తా చాటాడు. 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించాడు. డిసెంబర్‌లో ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపికైనట్టు ప్రసాద్ తెలిపాడు.

పేకాట శిబిరంపై దాడి

- పది మంది అరెస్టు

గంగవరం : మండలంలోని మొల్లేరు గ్రామ శివారులో పేకాట శిబిరంపై ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. పది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,750 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్టు ఆయన పేర్కొన్నారు.



పాడేరు అంబేడ్కర్ సెంటర్లో వైఎస్సార్‌సీపీ జెండాలతో ముస్తాబు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నియోజకవర్గ పరిశీలకుడు ఫరూఖీ



పాడేరులో బహిరంగ సభ నిర్వహించనున్న వేదిక

సామాజిక జైత్రయాత్ర

- నేడు పాడేరులో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- చింతలవీధి పంచాయతీ తలారిసింగి నుంచి ప్రారంభం
- పార్టీ శ్రేణుల్లో ఉరకలెత్తుతున్న ఉత్సాహం



పాడేరు మెయిన్‌రోడ్డులో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నవరత్నాల అమలు కమిటీ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, డాక్టర్ నర్సింగరావు

సాక్షి, పాడేరు: వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర సోమవారం పాడేరు నియోజకవర్గంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 11 గంటలకు పాడేరు మండలం చింతలవీధి పంచాయతీ తలారిసింగిలో యాత్ర ప్రారంభమై అంబేడ్కర్ సెంటర్ మీదుగా మెయిన్‌రోడ్డు సతకంపట్టు వరకు సాగుతుంది. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో పట్టణంలోని మెయిన్‌రోడ్డు సతకంపట్టు సెంటర్లో బహిరంగ సభ జరుగుతుంది. యాత్రలో భాగంగా పాతబస్టాండ్‌లోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. ఈ బస్సు యాత్రకు ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పర్యవేక్షణలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఏర్పాట్లు పూర్తి చేశారు.

● బస్సు యాత్రలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు పీడిక రాజన్నదొర, బూడి ముత్యాలనాయుడు, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి, కంబాల జోగులు, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి పాల్గొంటారు.

సాధికార యాత్రతో జోష్..

సామాజిక సాధికార యాత్రతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం ఉరకలెత్తుతోంది. యాత్రకు గ్రామాల్లో భారీస్థాయిలో స్వాగతం పలికేందుకు కార్యకర్తలు సిద్ధమయ్యారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హులైన అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలను అందజేస్తోంది. దీంతోపాటు అన్ని సామాజికవర్గాలకు రాజకీయంగా ప్రాధాన్యమిచ్చింది. వారి ఎదుగుదలకు విశేష కృషి చేస్తోంది. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతికి పాటుపడుతోంది. దీనివల్ల సామాజిక సాధికారత సాధ్యమవుతుంది. ఫలితంగా జగన్ పాలనలో అన్నివర్గాల వారు సంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార పేరుతో బస్సు యాత్ర నిర్వహిస్తోంది.

● ఇతర జిల్లాల్లో ఇప్పటికే ప్రారంభమైన ఈ యాత్రకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోంది. జనం స్వచ్ఛందంగా తరలివస్తున్నారు. వైవీ సుబ్బారెడ్డి రీజినల్ కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టాక జిల్లాలో పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించి ఉత్సాహం నింపారు. తాజాగా సోమవారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రతో ఈ ఉత్సాహం రెట్టింపు కానుంది.

అన్నివర్గాలకు సమన్యాయం : పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: మహానేత డాక్టర్ వైఎస్సార్ ఆశయాల సాధన లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు.సామాజిక, సాధికార బస్సు యాత్ర ఏర్పాట్లను ఆదివారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధిలో గిరిజన ప్రాంతాలకు సముచిత స్థానం కల్పించడం జరిగిందన్నారు. వైద్యం, రోడ్లు, రవాణా వ్యవస్థతోపాటు సెల్‌టవర్లతో సమాచార వ్యవస్థను మెరుగుపరిచిందన్నారు. నవరత్నాల అమలు కమిటీ వైస్ చైర్మన్ నారాయణ మూర్తి, పార్టీ పరిశీలకుడు ఫరూఖీ, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్భ నరసింగరావు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమం



ఎంపీ మాధవి

కొయ్యూరు: అన్నివర్గాల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషిచేసిందని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, సాధికార బస్సు యాత్ర విజయవంతంగా సాగుతోందన్నారు. పసలేని ఆరోపణలను చేస్తున్న ప్రతిపక్షాలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బస్సు యాత్ర ద్వారా సత్తా చూపించాలని కోరారు. పాడేరులో నిర్వహించే బస్సు యాత్రకు పాడేరు,అరకు నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు.

భారీగా పోలీసు బందోబస్తు



పాడేరులో సభ జరిగే ప్రాంతంలో బందోబస్తు ఏర్పాట్లను సమీక్షిస్తున్న ఏఎస్పీ ధీరజ్

సాక్షి,పాడేరు: సామాజిక సాధికారిక బస్సు యాత్ర నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. డిప్యూటీ సీఎంలు, మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానుండడంతో పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పాడేరు ఏఎస్పీ ధీరజ్ పాడేరు ప్రాంతంలో బందోబస్తును ఆదివారం పర్యవేక్షించారు. సీఐ సుధాకర్,ఇతర పోలీసు అధికారులతో సమీక్షించారు. బస్సు యాత్ర, సభ జరిగే ప్రాంతాలను పరిశీలించిన ఆయన పలు సూచనలిచ్చారు.

కార్యక్రమం షెడ్యూల్ ఇలా..

- ఉదయం 11 గంటలకు బస్సు యాత్ర పాడేరు మండలం చింతలవీధి పంచాయతీ తలారిసింగిలో ప్రారంభమవుతుంది
- తలారిసింగి పాలిటెక్నిక్ సమీపంలో రూ.500 కోట్లతో నిర్మిస్తున్న వైద్య కళాశాల భవన నిర్మాణాలను డిప్యూటీ సీఎంలు, మంత్రి,ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నామినేటేడ్ ప్రజాప్రతినిధులు పరిశీలిస్తారు. అక్కడే మీడియా సమావేశం నిర్వహిస్తారు.
- పాడేరు పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, సినిమాహాల్ సెంటర్, పాతబస్టాండ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సెంటర్ మీదుగా మెయిన్ రోడ్డులోని సతకంపట్టు వరకు బస్సు యాత్ర జరుగుతుంది
- బస్సు యాత్రకు సంఘీభావంగా బైక్ ర్యాలీ, నేతలు,కార్యకర్తల పాదయాత్ర జరుగుతుంది.
- మధ్యాహ్నం 12.30 గంటలకు మెయిరోడ్డులోని సతకంపట్టు ప్రాంతంలోని బహిరంగ సభతో ముగుస్తుంది.

సంఘీభావం



పాడేరు బస్సు యాత్రకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ప్రజాప్రతినిధులు

సాక్షి,పాడేరు: పాడేరులో జరిగే బస్సు యాత్రకు అరకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నేతలు సంఘీభావం తెలిపారు. అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో అరకు నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు,ఎంపీటీసీలు,సర్పంచ్‌లంతా తమ వాహనాల్లో పాడేరు బస్సు యాత్రకు స్వచ్ఛందంగా తరలివస్తున్నట్టు పేర్కొన్నారు.

కాంట్రాక్టు టీచర్లు..



సంఘీభావం తెలుపుతూ పాడేరు ఎమ్మెల్యేకు లేఖ అందజేస్తున్న కాంట్రాక్టు టీచర్లు

సాక్షి,పాడేరు: సామాజిక సాధికారిక పాడేరు బస్ యాత్రకు గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లంతా సంఘీభావం తెలుపుతూ పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి ఆదివారం రాత్రి లేఖ ఇచ్చారు.తమను రెగ్యులర్ చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతగా బస్‌యాత్రతో పాటు బహిరంగ సభకు తరలివస్తామని వారు తెలిపారు.

విస్తృతప్రచారం



కె.కోడాపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి

జి.మాడుగుల: పాడేరులో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను ప్రజలు విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, ఏపీ ఎస్సీ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్, మండల ఇన్‌ఛార్జి రవికుమార్, ఏపీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు,ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. కె కోడాపల్లి, గిరిగొయ్యిపాలెం,గెమ్మెలి, నిట్టమామిడి, మధురమామిడి, రీమెలి, నుర్మతి, వాకపల్లి, భీరం వనెల్బ, ఆగంపాడు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట



చాపరాయిలో సందడి చేస్తున్న పర్యాటకులు



కనువిందు చేస్తున్న తారబు జలపాతం

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతానికి ఆదివారం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. కుటుంబ సమేతంగా విచ్చేసి జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు.

జెండాకొండపై..

హుకుంపేట: పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న సీతమ్మ పర్వతంపై ఆదివారం పర్యాటకులు భారీగా సందడి చేశారు. శనివారం రాత్రి ఓలుబెడ్డా గ్రామానికి చేరుకున్నారు. అక్కడి నుంచి వేకువజామున కాలినడకన కొండపైకి చేరుకుని ప్రకృతి అందాలను వీక్షించారు.

తారబు జలపాతానికి..

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు,పెదబయలు మండలాల సరిహద్దులోని తారబు జలపాతానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం సెలవు దినం కావడంతో భారీగా తరలివచ్చి సందడి చేశారు.

మంచు దుప్పటి



మంచులో నీరు తెస్తున్న మహిళలు

పెదబయలు: మండల కేంద్రమైన పెదబయలులో ఆదివారం ఉదయం 9.30 గంటల వరకు మంచు తెరలు వీడలేదు.



చింతపల్లిలో కురుస్తున్న పొగ మంచు

చింతపల్లి రూరల్: మండల కేంద్రమైన చింతపల్లిలో ఆదివారం 18 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చలిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంది. మంచు దట్టంగా కురుస్తోంది.

రంపచోడవరంలో స్వర్ణోత్సవాల సందడి

ఏర్పాట్లలో నిమగ్నమైన జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి: స్థానిక శ్రీఅల్లూరి సీతారామరాజు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్వర్ణోత్సవాల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.డిసెంబర్ 2,3 తేదీల్లో జరగనున్న ఈ వేడుకల ఏర్పాట్లపై ఆదివారం పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. వేడుకల నిర్వహణకు సంబంధించి కార్యాచరణ రూపొందించారు. అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూర్వ విద్యార్థి ముదునూరి సూర్యనారాయణరాజు (హైదరాబాద్) రూ.8 లక్షలతో సమకూర్చనున్న 8 అడుగుల అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటుకు ఇప్పటికే భూమిపూజ నిర్వహించారు. పాఠశాలలో ఇప్పటివరకు టెన్త్ చదువుకున్న విద్యార్థులు బ్యాచ్‌కు రూ.లక్ష చొప్పున విరాళం ప్రకటించడంతో రూ.12 లక్షల మేర నిధులు సమకూరినట్టు స్వర్ణోత్సవాల నిర్వాహణ కమిటీ తెలిపింది. దేశ, విదేశాల్లో ఉన్న దాదాపు మూడు వేల మంది పూర్వ విద్యార్థులు ఈవేడుకల్లో పాల్గొనున్నారు. ఆదివారం జరిగిన సన్నాహక సమావేశంలో పూర్వ విద్యార్థులు దంతులూరి శివరామచంద్రరాజు, చీడిపల్లి అప్పారావు, వేటూరి సత్యప్రభాకర్, దేవరకొండ సూరిబాబు, బేతాళ లూథర్‌బాబు బుంగా రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాహస వినోదం



జిప్‌లైన్‌పై పర్యాటకులు

- గోస్తనీ నదిపై జిప్‌లైన్‌ను అందుబాటులోకి తెచ్చిన పర్యాటకశాఖ
- సందర్శకుల నుంచి విశేష స్పందన

అనంతగిరి: చుట్టూ దట్టమైన అటవీప్రాంతం.. గోస్తనీ జలసవ్వడులు.. ఎటుచూసినా ప్రకృతి అందాలు.. వీటి మధ్య సాగే జిప్‌లైన్ విహారం మిగిల్చే అనుభూతి మాటల్లో చెప్పలేనిది. బొర్రా గుహలకు వచ్చిన వారంతా ఈ సాహస వినోదంపై ఆసక్తి చూపుతున్నారు. పర్యాటకశాఖ రూ.35 లక్షలతో గోస్తనీ నదిపై ఏర్పాటుచేసిన జిప్‌లైన్‌కు పర్యాటకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గోస్తనీ అందాలను వీక్షిస్తూ మధురానుభూతిని పొందుతున్నారు. రెండు పక్కలా వెళ్లి వచ్చేందుకు పర్యాటకశాఖ రూ.500 టికెట్ ధర నిర్ణయించింది.

అందాలు అద్భుతం



గోస్తనీ నదిపై జిప్ లైన్ ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉంది. నదిపై నుంచి జిప్‌లైన్‌పై వెళుతుంటే ఆ ఆనందం మాటల్లో చెప్పలేం. జీవితంలో ఎన్నటికీ మరిచిపోలేని విధంగా మధురానుభూతి పొందా.

– అవినాష్, బొర్రా సందర్శకుడు, విశాఖపట్నం

చాలా ఆనందంగా ఉంది



బొర్రాగుహలను తిలకిద్దాం అని వచ్చా.. జిప్‌లైన్ ద్వారా ప్రకృతి ఒడిలో విహరించి అందాలను ఆస్వాదించా. ఇలాంటి సాహస కార్యక్రమాలను పర్యాటకశాఖ అందుబాటులోకి తెస్తే ఈ రంగం మరింతగా అభివృద్ధి చెందుతుంది.

– కిరణ్, బొర్రా సందర్శకుడు, తాడేపల్లిగూడెం

క్లుప్తంగా

ఉపాధ్యాయుల పదోన్నతులకు ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, పాడేరు: గిరిజన సంక్షేమశాఖలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలు, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి ఈనెల 30వతేదీ సోమవారం ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తున్నామని గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకుగాను ఫైనల్ సీనియార్టీ లిస్టును ఇప్పటికే ఆయా ప్రధానోపాధ్యాయులకు పంపినట్టు చెప్పారు. పదోన్నతులకు అర్హులైన ఎస్‌జీటీలంతా తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో సోమవారం ఉదయం పాడేరు ఐటీడీఏకు చేరుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్ర గవర్నర్‌కు వీడ్కోలు



విమానాశ్రయంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వీడ్కోలు పలుకుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదివారం విజయవాడకు పయనమయ్యారు. విశాఖ విమానాశ్రయంలో అధికారులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈనెల 27న విశాఖ వచ్చిన ఆయన ఆంధ్ర వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, ప్రత్యేక ఉప కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్‌డీవో డి.హుస్సైన్ సాహెబ్, పోలీసులు, ఎయిర్‌పోర్ట్ అధికారులు తదితరులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

నేడు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ విశాఖ రాక

మహారాణిపేట: పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సోమవారం విశాఖ రానుందని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఈ నెల 31న వ్యాపార, వాణిజ్య అంశాలపై వివిధ బ్యాంకుల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కమిటీ సభ్యులు సమావేశం కానున్నారని వెల్లడించారు. కేవీఐసీ, యుబీఐ నోడల్ ఏజెన్సీలుగా వ్యవహరిస్తున్నాయని..అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సీహెచ్ గణపతికి కలెక్టర్ సూచించారు.

లక్ష్యం దిశగా పయనం

ఆర్టీసీ ఫుల్ జోష్
- అక్టోబర్ ఆదాయం రూ.28 కోట్లు
- దసరాకు అదనంగా వచ్చింది రూ.కోటి
- ఈ పండగకు 400కు పైగా స్పెషల్స్ నడిపిన ఆర్టీసీ
- పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో



ద్వారకా బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యానికి ఆర్టీసీ చేరువవుతోంది. గత కొన్నాళ్లుగా విశాఖ జిల్లాలో ఆర్టీసీ ఆదాయం మెరుగవుతోంది. దాదాపు రోజుకు రూ.కోటి చొప్పున రాబడిని తెచ్చుకుంటోంది. సెప్టెంబర్‌లో రూ.27.40 కోట్లను ఆర్జించింది. అక్టోబర్‌లో దసరా పండగను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ యాజమాన్యం విశాఖ జిల్లాకు రూ.30 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇందుకనుగుణంగానే ఆర్జిస్తోంది. ఈ నెల 28 వరకు రూ.26.55 కోట్ల రాబడి సమకూరింది. నెలాఖరుకు మరో రూ.3 కోట్ల ఆదాయం రావచ్చని ఆర్టీసీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఈ దసరా సందర్భంగా విశాఖ జిల్లాలోని వివిధ డిపోల నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు దాదాపు 400 ప్రత్యేక సర్వీసులను నడిపింది. వీటిలో హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి ప్రాంతాల నుంచి, ఉత్తరాంధ్ర జిల్లాల వైపు ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంది. ఈ నెలలో దసరా ముందు వరకు 97 స్పెషల్ బస్సులు 53,860 కి.మీల మేర తిరిగి రూ.23,24,441 రాబడిని తెచ్చాయి. 67 శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)తో కిలోమీటరుకు రూ.43.16 చొప్పున లభించింది. గతేడాది దసరా ముందుకంటే ఈసారి ఎక్కువ సర్వీసులను తిప్పారు.

గత సంవత్సరం దసరాకు ముందు అదే సమయానికి 83 స్పెషల్ బస్సులు 40,792 కిలోమీటర్లు తిరిగి రూ.19,31,754 మాత్రమే రాబడిని తీసుకురాగలిగాయి. ఇక దసరా తర్వాత కూడా తిరుగు ప్రయాణమయ్యే వారి సంఖ్య కూడా బాగానే ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని విశాఖ నుంచి హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు మరో వంద (సుమారు 200 సర్వీసులు) స్పెషల్ బస్సులను నడిపారు. కాగా ఒకట్రెండు రోజుల్లో దసరా స్పెషల్ సర్వీసులు నిలిచిపోనున్నాయి. ప్రస్తుతం విశాఖ జిల్లా ఆర్టీసీకి 64 శాతం ఓఆర్ ఉంది. ఇది కార్పొరేషన్ సగటుకంటే 0.5 శాతం అధికం. గత సెప్టెంబర్ ఓఆర్ కంటే ఇది రెండు శాతం ఎక్కువని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

ముగిసిన ఏఎంసీ శతాబ్ది వేడుకలు

- ఆట పాటలతో హోరెత్తిన ప్రాంగణం
- అలరించిన సినీ గాయకులు



ఎంపీ సత్యవతిని సన్మానిస్తున్న సినీ గీత రచయిత అశోక్ తేజ, ఎంఎం శ్రీలేఖ తదితరులు

బీచ్‌రోడ్డు: ఆంధ్రా మెడికల్ కళాశాల శతాబ్ది వేడుకలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకల్లో సినీ సంగీత దర్శకురాలు ఎం.ఎం శ్రీలేఖ, గాయకులు గీతా మాధురి, అరుణ్ కౌటిల్యా, ధనుంజయ్ తదితరులు తమ గాత్రంతో హోరెత్తించారు. తెలుగు, హిందీ పాటలను పాడి వైద్య విద్యార్థులను ఉత్సాహపరిచారు. కొమరం భీముడో, యూ ఆర్ మై ఎమ్మెల్యే, ఓ సీత, బంగారు కోడి పెట్ట తదితర పాటలు ఆలపించి.. అలరించారు. గాయకులు పాడిన పాటలకు విద్యార్థులు తమదైన శైలిలో డ్యాన్సులు చేసి ఎంజాయ్ చేశారు.

ఎంపీ సత్యవతికి సన్మానం

అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతిని సినీ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ, సంగీత దర్శకురాలు ఎం.ఎం.శ్రీలేఖ ఘన సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వందేళ్లు పూర్తి చేసుకున్న ఏఎంసీలో తాను కూడా చదువుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. తన వంతుగా ఏఎంసీ ఉమెన్స్ హాస్టల్ కోసం ఎంపీ నిధుల నుంచి రూ.15లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రజలు దైవంగా భావించే వైద్య వృత్తికి మరింత వన్నె తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

తేనెలొలుకు తెలుగు

తెలుగు భాష చాలా పురాతనమైందని, రెండో శతాబ్దం నుంచి తెలుగు ప్రస్తావన ఉందని పలువురు వక్తలు అన్నారు. ఆంధ్రా మెడికల్ కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో ఆదివారం 'తెలుగు సాహిత్య వైభవ్'కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు తెలుగు సాహిత్యం గురించి మాట్లాడుతూ రామాయణం, మహాభారతంలో వైద్యం కోసం పొందుపర్చిన అంశాలను వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంసీ పూర్వ విద్యార్థి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు మాట్లాడుతూ తెలుగు కథ ప్రపంచ నలుమూలలకు చేరిందన్నారు. ఏఎంసీ శతాబ్ది ఉత్సవాల్లో తెలుగు సాహిత్యం కోసం కృషి చేస్తున్న వారిని గౌరవించడం ఆనందంగా ఉందన్నారు. ఏఎంసీతో తనకు తొమ్మిదేళ్ల అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు.

మంచాలలో సినిమా షూటింగ్ సందడి



షూటింగ్‌లో పాల్గొన్న నటీనటులు

మాడుగులరూరల్: చీడికాడ మండలం మంచాల గ్రామంలో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. రామయోగి గెలాక్సీ ప్రొడక్షన్స్ నంబరు-1 పతాకంపై నిర్మిస్తున్న సినిమా కోసం పలు సన్నివేశాలు చిత్రీకరించారు. హీరో, హీరోయిన్లుగా సాయికిరణ్, సాయి సంహిత్, ఇతర పాత్రల్లో సోమిరెడ్డి, రాజీవ్, జబర్దస్త్ టీమ్, ఓనమ్ అప్పి, ఎఫ్ఎం బాబాయి, సత్తిపండు, శృతి, జోత్స్న, శ్రీను నటిస్తున్నారు. ఆదారి మూర్తిసాయి దర్శకత్వంలో నిర్మాతగా ఎం.ఎస్.ఆర్. మూర్తి ఈ చిత్రాన్ని నిర్మి స్తున్నారు. పి.సతీష్‌కుమార్ సంగీతం సమ కూరుస్తుండగా, కెమెరామెన్‌గా ఆర్‌కే వ్యవహరిస్తున్నారు. ఎడిటింగ్ బాధ్యతలు జేపీ నిర్వహిస్తున్నారు. స్థానిక నటులు గండి గోపి, మహేష్ పాల్గొన్నారు. చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఇది వరకే చిత్రీకరించినట్టు దర్శకుడు మూర్తి సాయి తెలిపారు. వారం రోజుల పాటు మంచాల, చుట్టు పక్కల గ్రామా ల్లో షూటింగ్ ఉంటుందని ఆయన తెలిపారు.

విశాఖపట్నం టు కోల్‌కతా: సైకిల్ యాత్ర

- ఏజెన్సీ మీదుగా సాగిన ప్రయాణం
- సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం



సైక్లింగ్ చేసుకుంటూ విశాఖపట్నం వెళ్తున్న సైక్లిస్టులు అర్పిత్, బిప్లప్

అనంతగిరి: ఓవైపు సైక్లింగ్ చేసుకుంటూనే మరోవైపు పర్యాటక ప్రాంతాలను తిలకిస్తున్నారు ఓ ఇద్దరు యువకులు..పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కల్‌కత్తాకు చెందిన సైక్లిస్టులు అర్పిత్, బిప్లప్ సైక్లింగ్ చేసుకుంటూ కోల్‌కతా నుంచి జగదల్‌పూర్ మీదుగా అరకు నుంచి విశాఖపట్నం వెళ్తుండగా ఆదివారం సాయంత్రం అనంతగిరిలో కొంతసేపు ×సాక్షి×తో ముచ్చటించారు.. కోల్‌కతాలోని అక్టోబర్ 13న సైక్లింగ్ ప్రారంభించామన్నారు. సైక్లింగ్‌తో సంపూర్ణం ఆరోగ్యం లభిస్తోందని, సైక్లింగ్ చేసుకుంటూనే మరోవైపు పర్యాటక ప్రాంతాలను తిలకిస్తున్నామని, కల్‌కత్తా మొదలుకొని జదగల్‌పూర్‌లోని చిత్రకోట్, తీర్థగడ్ జలపాతాలు, అరకులోయ పర్యాటక ప్రాంతాలు తిలకించినట్టు తెలిపారు. విశాఖపట్నం నుంచి కోల్‌కతా సైక్లింగ్ చేసుకుంటూ వెళ్తామని తెలిపారు. కోల్‌కతా నుంచి విశాఖపట్నం మీదుగా మళ్లీ కోల్‌కతా చేరుకోవడానికి 1700 కిలోమీటర్లు వస్తుందని తెలిపారు.

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



అరకు నియోజకవర్గ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి, పాడేరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయడంతో పాటు ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమాన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పిలుపునిచ్చారు. పాడేరులోని తన నివాస గృహంలో ఆదివారం అరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజనులకు ఎంతో మేలు జరిగిందన్నారు. అన్ని గ్రామాల్లోని రోడ్లు, మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను కూడా పరిష్కరించుకుంటున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని, ఈ మేరకు మరలా సీఎంగా జగన్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. నియోజకవర్గాల్లోని అన్ని మండలాల ఎంపీపీలు , జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే ప్రగతి సాధ్యం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాగేశ్వరరావు

ఏయూక్యాంపస్: విద్య.. వ్యక్తి ప్రగతికి దోహదం చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. యాదవ ఎంప్లాయిస్ శ్రీ కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏయూలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అసెంబ్లీ మందిరంలో యాదవ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా క్రీడలు, విద్య రంగాల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు మంత్రి చేతులమీదుగా ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఆర్థికంగా వెనుకబడి, ప్రతిభ కలిగిన యాదవ సామాజిక వర్గ విద్యార్థులకు వైఈఎస్ ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత విద్యావంతులు కావాలని, తద్వారా ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవడం సాధ్యపడుతుందన్నారు. ఆర్థికంగా, సామాజికంగా ఉన్నతంగా స్థిరపడటానికి విద్య ఉపకరిస్తుందన్నారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల, వైద్య విశ్వవిద్యాలయం మాజీ వీసీ డాక్టర్ శ్యామ్ ప్రసాద్, టీటీడీ సభ్యుడు నాగసత్యం, రామారావు, డాక్టర్ రవికుమార్, మహేష్, అప్పలరాజు, దుర్గ బాబు, వెంకట రమణ, కార్పొరేటర్లు ప్రసంగించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లుగా చక్కెర ఫ్యాక్టరీలు

- మూతపడిన కర్మాగారాలను వినియోగంలోకి తెచ్చే దిశగా ప్రభుత్వం యోచన
- ఇప్పటికే నివేదిక ఇచ్చిన మంత్రుల సబ్ కమిటీ
- జిల్లాలో గోవాడ మినహా మిగతా ఫ్యాక్టరీల్లో యూనిట్ల ఏర్పాటుకు యోచన
- బెల్లంతోపాటు ఇతర ఆహార ఉత్పత్తుల తయారీ
- చెరకు రైతులకు ఊరట ఇవ్వనున్న ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలు



ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీ

చోడవరం: రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం యోచిస్తోంది. దీనికి సంబంధించి ప్రభుత్వం నియమించిన మంత్రుల ఉప సంఘం ఇప్పటికే ఒక నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. గత కొన్నేళ్లుగా తీవ్ర సంక్షోభంలో చిక్కుకుని మూతబడిన చక్కెర పరిశ్రమను ప్రత్యామ్నాయ పరిశ్రమగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటి వరకు పంచదారను తయారు చేసిన సుగర్ ఫ్యాక్టరీలు రానున్న రోజుల్లో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లుగా మారనున్నాయి. ఈ ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే మంత్రుల సబ్ కమిటీ ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చింది. రాష్ట్రంలో గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల కొన్నేళ్లుగా చక్కెర ఫ్యాక్టరీలు తీవ్ర నష్టాల్లో చిక్కుకోగా టీడీపీ ప్రభుత్వ హయాంలో అవి మరింత సంక్షోభంలోకి వెళ్లాయి. అప్పట్లోనే ఫ్యాక్టరీలను అమ్మేసేందుకు నోటిఫై కూడా చేశారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆ ప్రక్రియను నిలిపివేసి చెరకుకు భారీగా మద్దతు ధర ఇవ్వడంతోపాటు ఫ్యాక్టరీలకు నిధులు ఇచ్చి తిరిగి నడిచేలా చేశారు. ఆయన మరణానంతరం అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రులు, తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం మళ్లీ సుగర్ ఫ్యాక్టరీలను నిర్లక్ష్యంగా వదిలేశాయి. దీంతో ఫ్యాక్టరీలు పూర్తిగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి.

రాష్ట్రంలో 10 సహకార చక్కెర కర్మాగారాలు ఉండగా వాటిలో ఆరు ఫ్యాక్టరీలను గత ప్రభుత్వ హయాంలోనే మూసేశారు. నష్టాల్లో ఉన్నా గోవాడ (చోడవరం), తాండవ, ఏటికొప్పాక, భీమసింగి ఫ్యాక్టరీలు మాత్రమే క్రషింగ్ చేసేవి.

చెరకు సాగు విస్తీర్ణం సగానికి పైగా తగ్గిపోవడంతో గోవాడ మినహా మిగతా మూడు ఫ్యాక్టరీలు గత మూడు సీజన్ల నుంచి క్రషింగ్ చేయలేదు. రైతుల చెరకు బకాయిల వరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇచ్చినప్పటికీ పూర్తిగా నష్టాల్లో కూరుకుపోయిన మూడు ఫ్యాక్టరీలను నడపలేని పరిస్థితి ఏర్పడింది. గోవాడ ఫ్యాక్టరీ మాత్రం ప్రభుత్వ సహకారంతో నిలబడింది. అయితే పంచదార ఉత్పత్తి ఖరీదు ఎక్కువై, మార్కెట్‌లో ధర తక్కువగా ఉండటం వల్ల ఈ ఫ్యాక్టరీ కూడా దినదిన గండంగానే నడుస్తోంది.

డిమాండ్ మేరకు బెల్లం, ఆహార ఉత్పత్తుల తయారీ

రాష్ట్రంలో మూతబడిన చక్కెర పరిశ్రమలను ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలుగా మార్చే ప్రతిపాదనపై ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఫ్యాక్టరీలపై అధ్యయనం చేసేందుకు వేసిన మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం ఆ దిశగా ప్రభుత్వం యోచన చేస్తోంది. ఫ్యాక్టరీల ఆస్తులను కాపాడడంతోపాటు ఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఉపాధి కూడా కల్పించినట్టు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

అనకాపల్లి, భీమసింగి, ఏటికొప్పాక, తాండవ ఫ్యాక్టరీలను మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి బెల్లం, ఆహార ఉత్పత్తుల తయారీ కేంద్రాలుగా మారిస్తే బాగుంటుందనే అభిప్రాయంలో ప్రభుత్వం ఉంది. అంతర్జాతీయ బెల్లం మార్కెట్ కూడా వీటికి సమీపంలో అనకాపల్లిలోనే ఉండడంతో ఈ పరిశ్రమ బాగుంటుందనే అభిప్రాయం మంత్రుల కమిటీ వ్యక్తం చేయడం, ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా ఉండడంతో ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదన కార్యరూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది. వీటి నిర్వహణ అంశంపై కసరత్తు కూడా ప్రభుత్వం ప్రారంభించింది. ఇదే జరిగితే జిల్లాలో మూతపడిన సుగర్ ఫ్యాక్టరీలన్నీ ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలుగా మారి, ఈ ప్రాంతంలో కొత్త పరిశ్రమకు తెర తీయడంతో పాటు చెరకు రైతులకు కొండంత అండగా నిలిచే అవకాశం ఉంది.

ఫ్యాక్టరీలను కాపాడేందుకే..




మూతపడిన సహకార చక్కెర కర్మాగారాలను కాపాడేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లుగా మార్చాలని యోచిస్తున్నాం. దీనిపై ముఖ్యమంత్రికి ఒక నివేదిక ఇచ్చాం. పరిశ్రమలను ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేస్తే వాటిని పరిరక్షించడంతోపాటు కొందరికి ఉపాధి అవకాశాలు కూడా కల్పించినట్టు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. రైతులు, కార్మికులతోపాటు అదనంగా మరికొంతమందికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి వీలు కలుగుతుంది.

– గుడివాడ అమర్‌నాథ్, రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి

2 నుంచి గిరిజన యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం

క్రీడా పోటీల గోడపత్రిక ఆవిష్కరించిన ఎంపీ సత్యవతి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: క్రీడల ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించవచ్చని ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్టులో ఆదివారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడాపోటీల గోడపత్రికను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అచ్యుతాపురం ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌లో నవంబర్ 2వ తేదీ 8వ తేదీ వరకు 15వ గిరిజన యువత ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలు క్రీడా పోటీలకు బీహార్, మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన 9 జిల్లాల నుంచి యువత హాజరుకానుందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా క్రీడల మంత్రిత్వశాఖ అధికారి జి.మహేశ్వరరావు, నెహ్రూ యువకేంద్రం ఉద్యోగులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ..

జిల్లాలో ఇటీవల కేంద్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సదరం శిబిరాల్లో ఎంపికైన దివ్యాంగులకు కావాల్సిన పరికరాలు నవంబర్ మూడో వారంలో స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో అందించనున్నామని ఎంపీ సత్యవతి తెలిపారు. సుమారు రూ.కోటి 60 లక్షలు విలువ చేసే పరికరాలను ఉచితంగా అందిస్తున్నామని, ఈ కార్యక్రమానికి కేంద్ర సామాజిక న్యాయ సహాయ మంత్రి నారాయణస్వామి హాజరవుతారని చెప్పారు. బ్యాటరీ సామర్థ్యంతో నడిచే మూడు చక్రాల వాహనాలకు తన ఎంపీ నిధులు రూ.36 లక్షలు మ్యాచింగ్ గ్రాంట్‌గా విడుదల చేసినట్టు చెప్పారు. జాతీయ రహదారి జలగలమదుం జంక్షన్ వద్ద ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయనున్న జాతీయజెండాను నవంబర్ 7న ఆవిష్కరిస్తామన్నారు.

మద్యం మత్తులో అనర్థం

- స్విమ్మింగ్ పూల్‌లో పడి యువకుడి మృతి
- పార్టీలో ఎంజాయ్ చేస్తూ స్నేహితుడే నీటిలోకి తోసేశాడు
- సీసీ ఫుటేజ్‌తో వెలుగులోకి



సాయివర్మ (ఫైల్)

అచ్యుతాపురం(అనకాపల్లి): మద్యం మైకంలో ఏం చేస్తున్నారో తెలియని స్థితిలో తోటి స్నేహితుని మరణానికి కారణమయ్యాడు మరో స్నేహితుడు. పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన కొండకర్లలోని ఒక ప్రైవేట్ రిసార్ట్‌లో శనివారం రాత్రి స్విమ్మింగ్ పూల్‌లో పడి విజయనగరానికి చెందిన సాయివర్మ అనే యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి పరవాడ డీఎస్పీ శ్రీనివాసరావు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న 30 మంది స్నేహితులు కొండకర్లలో ప్రైవేట్ రిసార్టులో శనివారం సందడి చేశారు. స్నేహితుల్లో కొందరు మద్యం సేవించి స్విమ్మింగ్ పూల్ వద్ద నృత్యాలు చేశారు. ఆ సమయంలో సాయివర్మను మరో స్నేహితుడు సిమ్మింగ్ పూల్‌లోకి తోసేశాడు. నీటిలో పడిపోయిన సాయివర్మకు ఈత రాకపోవడమో లేక మద్యం మత్తు కారణమో గానీ కొంత సేపటికి స్విమ్మింగ్ పూల్‌లో తేలిపోయాడు. అప్పటికే జరగాల్సిన ఘోరం జరిగిపోయింది. సాయివర్మను ఆస్పత్రికి తరలించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. తొలుత అతిగా మద్యం సేవించడం వల్లే నీటిలో మునిగి చనిపోయాడని భావించినప్పటికీ సీసీ ఫుటేజ్ దృశ్యాలను చూసిన తర్వాత పోలీసులు ఘటనకు కారణాన్ని గుర్తించారు. పార్టీలో ఎంజాయ్ చేస్తూ స్నేహితుడే సాయివర్మను నీటిలోకి తోసేసినట్టు గుర్తించారు. అయితే ఉద్దేశ్యపూర్వకంగా జరిగిన ఘటన కాదని భావించిన పోలీసులు సాయంత్రం తర్వాత కేసు నమోదు చేశారు. ఆస్పత్రి వద్ద మృతుని కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. ఇక్కడి రిసార్ట్‌లో గతంలోనూ కొందరు స్నేహితులు పార్టీ చేసుకొన్న తర్వాత ఒక వ్యక్తి స్విమ్మింగ్ పూల్‌లో పడి చనిపోయాడు. అయితే ఆ సంఘటనకు సంబంధించి ఎటువంటి సీసీ ఫుటేజ్‌లు లేకపోవడంతో కేసు తీవ్రత గుర్తించలేకపోయారు. తాజా ఘటనతో కొండకర్ల పరిసరాల్లో జరిగే పార్టీలపై నిఘా పెట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.